
వందరగా ఉంటం చూచి "ఏమిటిది కొంపా లేక ఏమైనా సంతా" అని విసుక్కొని భార్యగారిమీద విరుచుకు పడతాడు. దాంతో ఫిష్. ఆమెగారు రానూ, పిల్లలకు నాలుగు వీపుమీద వెయ్యనూ, ఆ యిల్లు వాతావరణం మారనూ—అన్నీ అలా సినిమా రీళ్ళలా జరిగిపోతాయి. ఇంత రభసా జరక్కుండా ఉండాలంటే ఒక్కటే మార్గం. భర్త యింటికి వచ్చి రాగానే— "పిల్లలు మరి; వాళ్ళుకాకపోతే మనమా ఆడుకునేది?" అని సర్దుకుంటే—అంతా ఆనందమే

ఇంత చెప్పడ మెందుకు కానీ మనిషి జీవితం అసలు సర్దుకు-పోవడంతోనే మొదలవుతుందని నా అభిప్రాయం. నిద్ర లేవ




గానే కాఫీ బాగా లేకపోతే, భార్యకు ఈలా సాగ లేదుకాబోలు పాపం అనుకోవాలి. వంట బాగులేకపోతే—ఆవునుమరి వెధవ ఆఫీసు పదిగంటలకేనాయె ఆమె ఏమన్నా మిషనా. అలా సరిగ్గా చెయ్యటానికి—అనుకోవాలి భర్త చికాకు పడితే "వ్వ ఆఫీసరేవో తినివచ్చి ఉంటాడు మరేం చేస్తారు చికాకు కాకపోతే?' అనుకోవాలి.

అలాగే మనమేదేనా కొత్త చోటికి వెడతా మనుకోండి. అక్కడి వంటకాలు బాగా వుండ వనుకోండి. అప్పుడు మీరేం చేస్తారు? "అబ్బే నాకు బీరకాయ సయించదు" అనో లేక "నేను స్వీట్ ఎక్కువ తినలేను" అనో సర్దుకు పోవాలి.

సరే; కోడలు అత్తగారితోనూ, కొడుకూ కోడలు దగ్గర అత్తమామలు, పిల్లలతో తల్లులు, తల్లులతో పిల్లలు, యిలా అందరితోనూ, అన్నివేళలా సర్దుకుపోతూ ఉండాల్సిందే. అసలు జాతీయ, అంతర్జాతీయ విషయాలలోకూడా ప్రభుత్వం ప్రజలకోసం. ప్రజలు ప్రభుత్వంకోసం సరిపుచ్చేసు కుంటున్నారు. సర్వజన సామరస్యం కూడా సర్దిపుచ్చుకోడం మీదే ఆధారపడిందని నా దృఢ నమ్మకం. ఇంతెందుకూ? ఈ వ్యాసం చదివిన పాఠకులు కూడా బాగానే ఉంది అని సర్దిపుచ్చుకోవాలని నా కోరిక. ●

## ఆలుమగలు

"నేను మీ యింటికి భోజనాని కొస్తున్నట్టు మీ ఆవిడకి తెలుసా?"
"భలేవాడివోయ్. నిన్ను భోజనానికి పిలిచినందుకు మా ఆవిడకి నాకూ పొద్దున పెద్ద దెబ్బలాటైతేను!

ఏరా అబ్బాయ్. మళ్ళీ నిన్న రాత్రి మీ ఆవిడా నువ్వూ మాటా మాటా అనుకున్నారుట."
"లేదు బాబాయ్. నేను అనుకున్నాను. మా ఆవిడ అంది."

# కనక-వీణ

—రెడ్డి, రాజమహేంద్రవరము
గోదావరి తల్లి,—చల్లగా కమ్ముకుని,—
పచ్చని చూపు చూడగా,— ఆ కేదారంల్లో
వేసి వేగమని పడుచుదనం, పరువూ
మర్యాదా ముక్కారు పైరుగా,—పండుతూన్నది:
అది,—ఏనాడో పల్లె,—ఎన్నడో పట్టణమైనది:
ఉన్నంతలో నగరమైనది: మృకండు పుత్రుణ్ణి,—

## మల్లాది రామకృష్ణశాస్త్రి

బుజ్జగించి తనంత వాణ్ణిగా దీవించిన అగజా మనోహరుడికి అది మారట కైలాసమైనది: నర నారాయణులవలె నన్నయ, నారాయణుడు. అక్కడ నిత్యానుష్ఠానము చేసినాడు: మార్కండేశ్వరుడు. — నన్నయగారు పఠింటంగా,- నారాయణభట్టు,- ఆ స్వామికరుణను తనకు స్ఫురించిన స్వారస్యము,- అప్పటి కప్పుడు తోచినతీరున ఆయిదు భాషలలో వివరంగా విన్నవించగా- ఆమాలించి,- తెలుగు కవితకు మేలెంచినారు: నన్నయగారి పైడి గంటము చలువ,- దేవర దీవెన,- కలిసి మెలిసి,- ఆ పురమున కాపురమున్న వారికి, తరగని కవితా సంపదగా, పరిఢవిల్లినది:

ఇది,- అల్లాడరెడ్డి హయాము: మరింతలుగా. పన్నెదేరి,- నగరము,- సీమకు నాయకమణిగా తేజరిల్లుతూన్నది: నగరాన గల,- చిన్నలు కవులు,- పెద్దలు పరసులు,- విరిబోణులు పరువిచ్చే నెరజాణలు,- వీరభద్రారెడ్డి,- పెద్ద లందరికీ,- అనుంగు మేనల్లుడు - చిన్నలకో,- నెచ్చెలి: నగరంలో, వారికి భక్తి ఉద్యోగము,- భయము శూన్యము:

ఏలిన వారంటే భయమూ భక్తీ లేకుండా,- తమ పిల్లవాణ్ణి చూసుకున్నట్టు వేయికన్నుల కనిపెట్టి చూసుకుంటాడు చిట్టి పంతులు:

ఆయన,- పర్వతమంత మనిషి— ఉరువుకు తగినంత ఉన్నతి కలవాడు: పండిన మాటలవాడు. పరిపక్వమైన నవ్వులవాడు: ఆయనకు అంతఃకరణే ఆస్తి, శివుని దర్శనమే ఐశ్వర్యము: ఆలయమే స్వగృహము, నగరంలో వారే,- బిగము: రెడ్డిగారికి ఆయన చిరునవ్వే,- ఆయన పలుకరింపే నిత్య దీవన: ఆ సామ్రాజ్యానికి ఆయనే ప్రాభవము:

కొండవీడులో,- అంతకాలమూ నీడ పట్టున కాలక్షేపము చేసిన శ్రీనాథుడు,- యీ నగరానికి వెదుక్కుంటూ వచ్చాడు:

తాను వీసము గణించేందుకా - గోదావరికి యిద్దరిని దాతలే కరవైనారా ?-

మరల రాజాశ్రయమా ?- కొండవీటిలో తాను అనుభవించిన వైభవము ఎన్ని జన్మములకు చాలదు ?

యిక్కడ ఏమున్నది ?-

గోదావరి:

అక్కడ కృష్ణ లేదా ?-

ఉన్నది- యింకా ప్రవహిస్తూనే ఉన్నది.

కొండవీటి రెడ్లు చేసిన పుణ్యాన్నంతా,- ఒక్క విసురున తనలో కలుపుకుని,- చెక్కు చెదరకుండా,- దరు లొరసికొని,- పరచడిస్తూనే ఉన్నది: ఆ తల్లి తనకు,- తన వారికీ తల్లి గాకుండా పోయింది—

యిక్కడ - గోదావరి:

రా - నాయనా,- అన్నట్లనిపించింది;

వెనుజూడక,- మరో యోచనలేక, కదలి వచ్చినాడు: తన నెరిగిన వారుండవచ్చునేమోకాని,- తా నెరిగిన వారు లేరు; లేరనగా ప్రత్యేకముగా పరిచయమున్న వారు లేరు: మంత్రి అన్నయ్యగారు - సాటి పాత నాటివారు; తాను, వారి కంటికి అంతగా, ఆనక పోవచ్చును: ఏమంటే,- వారు-,







పరమ మాహేశ్వరులే,- సద్ధర్ములే,- మంచికి పోయేవారే.- కాని,, వస్తుతః వంట పుట్టిన లౌక్యము ఉండనే ఉంటుంది కద!- కొండవీటిలో,- దైవం చల్లగా చూసినంత కాలం రాజ్యంచేసి,- యీ నాడు రమారమి నామరూపాలు లేకుండా పోయిన వారి ఉప్పు తిని బ్రతికిన మనిషిని,- నిలువనీడ కరవై- దేశం విడిచిన కవనాల వానిని, వారు చూసీ చూడగానే,- కౌగలించుకుని చుట్టరికం జరుగవేసి పెద్ద పీట వేస్తారా ?- అందుకు తాను ఆశపడి వచ్చాడా !- కాగ పోగా,- తన తాతగారూ,- అంతో యింతో వీరికి దీక్షైనవారే కనుకనూ, ఆయన తనకు ఒక పేలువిడిచిన—కావలసినవారై ఉండకపోవడమంటూ ఉండదని, వారు భావించడము చేతనూ,- అది ఒక లౌక్యమే అనుకుందాము - తనను - ఒక ఆశ్రితుణ్ణిగా పరిగణించేందుకు వారు సంకోచించకపోవచ్చును: కాదంటే ఘనంగానే సంభావించనూ వచ్చును: దానికేం! - తాను చెట్టుపేరు చెప్పి పండ్లమ్ముకునేందుకు వచ్చాడా ?- అది కాదే అనుకుందాం!- తనకు తానుగా,- వారి ఎదుట పడి,- గోత్రప్రవరలు చెప్పుకోవలసిన అవసరమేమున్నది:

కవితను కృష్ణాతీరాన వదలపరచి వచ్చినాడు :

కొండవీటిరాజులు- కను మూసిన చోట. - ఆ రాజ్యరమ శాశ్వతముగా కు వి కి న చో ట - తన క వి త కాపున్నది :

తా విప్పుడు కవికాడు : సంపన్న గృహస్థు కాదు : కవితతెచ్చిన పేరు తనదికాదు : అనుభవించిన వైభవము వెనుకటి జన్మలోది ; తాను కేవ లము- - మారన్న కొడుకు - ఆ పోలికనే దేశద్రిమ్మరి : తనకు లేమి లేదు - కావలసినది. - కావలసినంత ఉన్నది : చిత్తశుద్ధి ; లేని - దేది



మనశ్శాంతి ! అది,- యీ గోదావరీ తీరాన లభించేదని,- యింత దూరము రానైనది :

స్నానఘట్టంలో,- సమ్మర్ద మెక్కువగా ఉన్నది : మనిషిని మనిషి ఒరసికొంటూ మునకలు వేస్తున్నారు : అక్కడ తా దూర నందులేదు : ఒడ్డునే నడచుకుంటూ పోతు న్నాడు : పడబారల కొకడుగా గజ యీతగా డుండి-నేరనివారికి ఈదులాటనేర్పుతున్నాడు: ధ్వజమెత్తిన చిరు నౌకలు,- నీటిమీద దూర దూరాన తేలి ఆడుతూ, - యీదులాడే వారికి, - పొరబాటున ఆదమరపు వచ్చి నట్లయితే అదుకునేందుకు సన్నద్ధములుగా ఉన్నవి : తలచినచోట నదిలో దుమికి,- లోతు చూసుకుంటూ యీదుకుపోయి,-



అరక్రోసుదూరం పోయి.- అక్కడున్న లంకను ముమ్మారు చుట్టి.- యీతలోనే గాయత్రి ముగించుకుని మెట్టపట్టి.- సూర్య భగవానుడికి నమస్కార ప్రదక్షిణముచేసి.- నిలుచున్నచోటనే కనులు మూసుకుని.- ఒక్క గడియ ధ్యానిం - అప్పటికి.- చిట్టి పంతుల్ని చూశాడు :

ఆయన జపమూ అప్పుడే ముగిసినట్లుంది: లేచేందుకు విశ్వప్రయత్నము చేస్తున్నాడు :

శ్రీనాధుడికి చూడగా,- చూడగా - నవ్వు రాబోయింది : మొగ మటు తిప్పుకున్నాడు :

చిట్టి పంతులు ఉరుముల పెట్టున నవ్వు తుంటూ అడుగులు త్రొక్కుకుంటూ దగ్గి రసా వచ్చి,- 'అబ్బాయ్ - నవ్వాలనిపిస్తే - వెంటనే నవ్వేయాలిరా,- నవ్వంటే ఏమి టనుకున్నావ్ !- కైలాసనగం ! నవ్వులో శివుడున్నాడురా,- నవ్వేవారిలో వాడుంటా డురా,- అందరికీ ఆ నవ్వురాదురా-అలాగే,- అలాగే నవ్వరా !- అదే వాడికి మెప్పురా !-' ఆయన చేతులతోబాటు ఒళ్ళంతా తిప్పు కుంటూ హెచ్చరిస్తూ ఉంటే ఆయన మహా

కాయం ఆ ఆనందంలో పడే శ్రమ చూసి.- యిక నవ్వు ఆపుకోలేకపోయినాడు :- 'ఆఁ-ఆఁ-ఆలా నవ్వగలిగినవాడే నావాడు:' అంటూ అమాంతం కౌగలించుకొని,-ఉక్కిరి బిక్కిరిచేసి వదిలేశాడు : 'రాఁ యిక కదులుదాం !' అన్నాడు : శ్రీనాధు డనుకున్నాడు కదా,- పడవ ఒడ్డుకు వచ్చి,- యీయన నెక్కించుకుంటుందేమోనని : ఉహుఁ - చిట్టి వంతులు ఓంకారము పట్టి,- ఏనుగంత వత్తువతో నీటిలోకి దుముకి,- నాదము కలిలింప జేస్తూ,- హంసలాగా తేలుతుంటూ ముందు పోతున్నాడు. యీతడు,-అతని చాటులో నే.- యిద్దరూ నర సంచారము లేని చోట ఒడ్డు ఎక్కారు : ఒరే నాన్నా ! నరకంటే మన ఒంటికి సరిపడదేమోనని సాంబశివునికి శంక : మనకు వీలుగా,-తనకు చేరువుగా,- చాలినంత మేర,- తనకు, కాదు - మనకు - జలమయంచేశారు : వారు తలచుకుంటే ఎంత,- సిగలో పనాయెను : ఒక్క పుదినెడు,-గంగాజలాన్ని యిలా వదలారేమో,- ఆదే మనకు ఉద్ధోలం !- మనం:- వెనకటి జన్మలో,- చెంగల్వ !- యిప్పుడు గురుతుంచుకో లేదుకాని,- ఏదో కొలనులో పుట్టాను : వికసించాను : ఎవరో భక్తుడు పుణ్యానికి పోయి, స్వామివారికి సమర్పించాలని.- పెనుగులాడాడు : మనది,- జ్ఞానము కాదు అజ్ఞానమూ కాదు : పుష్పాది వస్తువులో ఉంది.- చిర్రబిర్రిసాను : పెనుగులాడి మెట్టుకు సాధించాడనుకో,- వదలంగా పట్టుకుని ఒడ్డుకు వచ్చి.- అక్కడ ఒక నంది వర్ధనం గుబురుమీద,- నన్నుంచి,- ధోవతి పిండుకుంటున్నాడు : నా కప్పు డనిపించింది కదా,- 'మెట్టను పుట్టి, చెట్టున పూసిన పూవైతే.- ఎంత మేలు ?- రాలిన దాని నేరుకు పోయేవు కాని,- కొమ్మనుండగా త్రుంచరు కద ?- నాకు, ఆ జన్మ ఎందుకు రాలేదు-?' యీ ఆలోచన చండమారుత మల్లే వచ్చింది-నాకానికి.- గాలికి కొమ్మ కదిలింది : నేను నేల మన్నాను : ఆ భక్తుడు,- ఉసూరుమని,- రాలిన పూవుల నేరుకుని - నావంక జూడలేదు :

నేను,- నేలసోకితే పవిత్రము కానా,- నాలో,- నాల్గవపాలు లేవే - నేనీ పూవుల పాటి చేయనా,- ధిక్ అనుకున్నాను : పూజకుకొరమాలితేనేమి-నామనత,-నాగరిమ ఎక్కడికి పోతుంది ? అనుకున్నాను : ఎక్కడికీ పోతుంది నాన్నా ! నాతోనే ఉంది ! యీపుటకెత్తింది : నరుడికి నాలుగింత లనాను : నేలనే అంటిపెట్టుకున్నాను : కొమ్మ కెగురలేను కాని,- నీరంటే ప్రాణం : నే నిప్పటికీ నీటిలో దిగితే చెంగల్వనే,- ఉపమకే మొచ్చెగాని,- చూశావు కాదూ !- అయితే,- అంత బ్రతుకు బ్రతికినవాడికి - ప్రస్తుత స్థితి భారకంగా లేదా అంటావేమో!- లేదు : నే నెక్కడికన్నా కదులుతానా పెడతానా,- అలా వాడి సన్నిధిలో పడుండటమేగా !- వాడి సిగలో ఏముంది - వెన్నెల!- అది నామీదనే సోకుతూందిరా ! ఆ జన్మలో నోచని పూజ యీ జన్మలో చేసుకుంటున్నానురా !-పూజ లెందుకనవేం ! వచ్చే జన్మకు అక్కరకు వచ్చేందుకు !- యింకో జన్మ ఎత్తేందుకు ఓపిక ఉందా అంటే - చేసుకోవాలి !- ఆ ఒక్క జన్మా ఎత్తకపోతే వెనకటి జన్మల తపసంతా,- వ్యర్థంరా నాన్నా!- మరి,- యిప్పుడు చేస్తుందేమ టావా - ముందుకు అక్కరకువస్తే, సాధన !- వాడికి,- విసుగెత్తేంతవరకూ,- సన్నిధిలో కూలబడి ఉండి, పేరు పేరునా పిలవడం.




నాకు విసుగెత్తకముందే,- వారికి వేడుకలకు వేళకావడం- ఆ వేడుకేమని అడగవేం- సంజ ముదిరితే వారిక్కడ ఉండరు : మరెక్కడ !- అందరికీ తెలిసిందేగా,- ఆ దక్షరామంలో,- ఒక్క సానిపాపకూ,- కునుకు రానీకుండా కులికి,- మళ్ళీ తెలతెలవారేసరికి నాపాల బడతారు : నీకు యింతవరకూ ఆ వైనం దెలిసినట్టులేదు ! పోయి చూచిరా:- వాడు,- అలా ఉల్లాసంగా ఉన్న తరుణంలో మనకంట పడతాడా అంటావా ?- ఎవరికోసం ! చిట్టి వంతులు మనిషంటే శివు డెదుర రాడూ ?-యిది మాకూ మాకూ ఉన్న ఖరారులే—

ఆఁ-యింతకుముందు చెప్పుకుపోతూంటిని చూడు,- మనకు వచ్చే జన్మ ఖాయం అని ?- అదేమిటని ?- మానస సరస్సులో రాజహంస !- అది రూఢి !- ఎలాగంటావా ?- నాకు పదేళ్ళు వచ్చినప్పుడు,- పాతికేళ్ళ వాణ్ణంత ఉండేవాణ్ణి-ఊళ్ళోవాళ్ళు అది, పెంపకం తీరనుకునేవారు ! వెనుకటికి ఎవరో అన్నట్టు,- 'వెన్న దిన్న గొల్లవాడు బలిశాడా,- పప్పు అన్నం తిన్న బ్రాహ్మడు బలిశాడా ! అ పిల్లనగ్రోవివాడు - తనకన్న ఘనుడు లేడనుకున్నాడు - ఎదగలేదు : యింకా కావాలి-కా కావాలి అన్న అబమీద ఉన్న బ్రాహ్మణుడు,- అంతకంత అవుతూనే ఉన్నాడు : మనమూ అంతే !_

అప్పుడే అంత పొంకంగా, నేవళంగా ఉన్న బాలుణ్ణి, పెళ్ళి చూపులకని,-ఓ పెద్ద మనిషి వచ్చాడు-వాడి వంశము పెళ్ళీడు కొచ్చిన ఆడపిల్లలతో వర్ధిల్లా-వారిల్లు బాలపాపలతో కిటకిటలాడా !—మావాళ్ళ ఆస్తిపాస్తు లింతా అని,-వాకబుచేసి,-లాంఛనానికి నన్ను చూడాలంటూ వచ్చాడు : మా నాన్న నోరాడనివాడులే !-ఆ వచ్చిన గృహస్థు యింకా ఆసన శుద్ధిగా కూర్చోకముందే- ఏమండీ,-మీ చిరంజీవి జబ్బపుష్టి ఉన్న మనిషేనా-యీ యింటికొచ్చే పిల్లకు అది, అతి ముఖ్యం ! మా చిట్టి తండ్రి, కూచుంటే.- స్వశక్తిమీద లేచే స్థితిలో యిప్పుడే లేదు ! యిల్లా లోకర్తె వస్తున్న వంబరం వచ్చి మీద పడ్డవా,-యిక మనతరం కాదు : ఆ వచ్చే పిల్లే ఊతం కావాలి : మాకు కను ముక్కు తీరుతో నిమిత్తం లేదు ; యిందుకు తూగితే చాలను ; ముందుగా మనింపు వేసుకుంటే మంచిది...యిలా అంటూండగా, నేను మందగమనంతో అక్కడికి రావడం.- ఆదుగో, మా రాజహంస ! అని మా నాయన అనడం : ఆ వచ్చిన పెద్ద మనిషి మన ఆకార వైభవం జూసి,-గుక్క తిప్పుకోలేక పోవడం : ఆపై ఒకరిని చూసి ఒకరు నవ్వుకోడం !-మా నాన్న మరీ ఒంటిరెక్క మనిషిలే-ఉఫ్‌మంటే నూరామడ ఎగిరేట్టు ఉండేవాడు : ఆయన దగ్గరకొస్తే - ఏం ముణుగుతుందో అని, పత్తువకొద్దీ గాలిపీల్చే వాడిని కాను :

నాకు అవాళ ఎందుకో-అలవాటు లేనిది-కోపం వచ్చింది : ఆ పదార్థం అంటూ ఒకటి ఉన్నదని అసలు మనం అప్పటికి ఎరుగం : పైగా,-రాజహంసంటే ఎక్కడ ఉంటుందో, ఎలా ఉంటుందో తెలియదు; "ఏం నాన్నా ఎక్కడుంటాయి" అన్నాం ! అవి ఎక్కడుంటే నీకేంగాని, వాటి మానాన వాటిని అలా బతుకనీయరా నాన్నా!- మన గాలి సోకి పుంజుకుంటే,-వాటికి ఆ మడుగు చాలదు :" అన్నారు వారు : నేనంటే ఆయనకు నవ్వులాట కాదు ! మాటకు ముందు నవ్వడం ఆయన నైజం ! మనలోనూ

ఆ పాలు ఓ పిసరు ఉందనుకో!-సరే చూసా అనుకున్నాం.-వెళ్ళాం, చూశాం!-ఎల్లా వెళ్ళ గలిగావని అడగకు,-ఆ రభస తలచుకునేందుకు ఓపికలేదు; అరే అబ్బాయ్ బ్రతుకంటే అదిరా!-మన వచ్చే జన్మ అదిరా!-

అక్కడ మనకు ఓ తలకు మాసిన వానితో తగులాటమైంది: వాడు మనవాడే,-మన తెలుగులవాడే?-మా రన్ననీ! నాకు తగిన వాడొక్కడే! అది కృష్ణ - యిది గోదావరి దారిలో తగిలినాడు: ఎక్కడికంటే ఎక్కడికి కనుకున్నాం!-అక్కడ జేరుకున్నాం: ముప్పొద్దులున్నాం! నా మాటకు వాడు తథాస్తని నాడురా! అసీ వాడనినట్లు లేదురా-హిమవన్నగమే నినదించినదిరా!- ఆ స్వామే పలికినట్లుందిరా!- "ఒరే అన్నా నీ కోరిక ఏమిరా?" అన్నాను. "కోరికలన్నీ కొడుక్కప్పగించి వచ్చానురా!"-అన్నాడు: వాడి పేరేమిటన్నాను-అది మన సీమలోనే ఉంటుందిలే యీ యెగువకు వ్రాకదన్నాడు: మనిషంటే-వాడే మనిషి!-తిరిగి తిరిగి కాశీ జేరుకున్నాం-అంతే, -మళ్ళీ కనబకలేదు-కాని,-వాడి జన్మంతా కళ్ళలో మెదులుతూనే ఉంటాడు-ఈనా డెందుకో,- మరీ కళ్ళముందు మసలుతూన్నాడు: అదేమిటో -విన్నా జూస్తే వాడివి జూసినట్టుంది-ఏమిటిది?

అదే!- నేను ఆ మారన్న కొడుకునే!-

"ఏ మారన్న!"

"కోరికలన్నీ కొడుక్కి విడిచిపెట్టి-కృష్ణా తీరానికి,-దూరమైన మారన్న-"

శ్రీనాధుడు చిట్టి పంతులకు తన కథ, తన తండ్రి వృత్తాంతము కథలాగా చెప్పినాడు: పంతులు ఊకొట్టినాడు: అంతా విని,-ఉహూ అని,-

అయితే నీ విక్కడికి ఎందుకు వచ్చినట్టు,-

మరెక్కడికీ పోలేక!-

రాజదర్శనం కావాలా!

అక్కర లేదనను కాని,-ప్రస్తుతం అవసరంలేదు:

"వీరభద్రయ్య కవిత్వమంటే చెవిగోసుకుంటాడురా!- అందులో కొండవీటినుంచి వచ్చావంటే ఏను గెక్కించడూ - నీవు పోనక్కరలేదు: వర్తమాన మంపితే వచ్చి సందిట వేసికుని పోతాడు-"

"వద్దంటినిగా-"

"పోనిలే గాని, — రాజులంటే మొగం మొత్తి పోయిందేమో పాపం-మన వాడే,-అంటే మన మతంవాడే,-అన్నయ మంత్రి - బెండకాయవంటి బ్రాహ్మడు: ముదురెక్కిన కొద్దీ,-నునుపు తేలుతున్నాడు: బోసినోటితో తాంబూల చర్వణం చేస్తాడు: మనక చూపుతో, అలా చేయి అడ్డం పెట్టుకుని,-సభలో చామరంపట్టే పిల్ల దాన్ని ఒక్క పర్యాయం పరకాయిస్తాడు; మనసులో భోగి, వర్తనలో విరాగి,-దర్పమంత దయాదాక్షిణ్యములున్నవాడు: మంచి మాటకారి-ఆయనతోమాట కలిపావో మరి వదలవు! నగరంలో ఉంటే,-మన కెదురమే వాడే; ఆ భీమన్నను సేవించుకో బోయినాడు: పోతే ఒకరి నొకరు వదలరు: మనలో మాట,- నీవూ పోయిరా రాదూ!-

అదే అనుకుంటున్నాను:

తీరాపోయి,-యకాయకిని ఆ అన్నయ్య కంటపడ్డావో, సంజపడ్డదో నిన్న గడప కదల నియ్యడు: ఏదో అదనీ యిదనీ కథాకమామీషూ చెపుతూ కట్టి పడేస్తాడు: సంజెపడిన తరువాతనే అక్కడ సంబరం అంతా! లోకానుభవం విషయంలో నేను నీకు చెప్పేదేమిటిగాని.-సుఖంగా వెళ్ళి!-పాలకీ తెప్పించనా?-

అక్కరలేదు;-

అక్కర లేదంటావనే అంత ఆప్యాయనంగా అడిగినాను: చిట్టి పంతులకు పాలక్కీ కావాలంటే, - విన్న బోయీలు ప్రాణభీతితో, - మహారాజు సన్నిధిలో వ్రాలి మనవి చేసుకోవడం,-

వారు, వాళ్ళకు అభయమిచ్చి, మన వినియోగానికి రథ గజాదులను పంపించడమూ జరగుతుంది: అవి మనకెందుకులే-నీ ఓపికనే పోయిరా!- తిరిగి వచ్చినాక,-నా కోసం ఎక్కడా వెదక నక్కరలేదు: ఉంటే గోదావరిలో లేదా,- యీ గుడిలో!.' సెలవిచ్చి పంపినాడు చిట్టి పంతులు-

—సంజె పడకముందే గ్రామ పరిసరాలకు జేరుకున్నాడు శ్రీనాధుడు: అక్కడ కొలను:కొలను ప్రక్కన వికళ వృక్షములు, ఆ నీడలో విశ్రమించాడు: దారిన పొయ్యే వారు పలుకరించారు. ఊరువారు అరగింపుకు పిలిచారు. అన్నయ్య గారి సన్నిధానవర్తి ఒక శ్రోత్రియుడు,- ఎవరో పరదేశి బ్రాహ్మణుడు వచ్చినాడని విని,-వచ్చి — గోష్ఠికి రమ్మని ఆహ్వానించాడు: అప్పటికి తప్పించుకున్నాడు:

ఊరికి కొండ గుర్తులు రెండే:
భీమ నాధుని ఆలయ గోపురమొకటి
స్వామివారి క్రీడావన మొకటి—
ఆవనానికి సరసను భీమేశ్వరుని
సానివారి:

అటు, దారి ఎటో-ఎవనినీ అడుగ
నక్కరలేదు

మనసుకు సూటిగా పోయి,- మమతతో మలుపు తిరిగితే,- తలవాకిట కాపున్న తరుణి కంటికి తగిలితే,- అది,- అదేకదా,-

అక్కడ నర సంచారము లేదు:

గ్రామంలో వారు ఆ చాయలకు పోవరా,-

వారు-వీరిని ఆదరించరా?-

తెలుసు కోవలె-

ఊసు మాటు మణిగే ప్రొద్దు కాదది-

ఏ యింటి కాయిల్లు కలకలాడుతూనే ఉన్నవి; ఏ యింటి కా యిల్లు గానమాడుతూనే ఉన్నవి-

ఎదుట కొచ్చినవారు లేరు—

పలుకరించినవారు-లేనేలేరు, లేక - పరువమున ఉన్న బాలలే లేరా?- వున్నవారు,-పలుకరించే స్థితిలో లేరా?-

రాజ భవనమేమో అన్నంత ముచ్చట వేసే భవనం కనిపించింది: అక్కడ పవళింప మనసైంది - నిదుర తనకు తెలియకుండానే వచ్చింది-

వచ్చి నంతలో,- తనంత తానే మెలకువ వచ్చింది: బడలిక తీరింది-వున్నట్టుండి - తాంబూలము మనసైంది-


అలవాటు మేరకు కలయ జూసినాడు.
ఎవరో ఒక ప్రౌఢ, ఎదుటికి వచ్చినది—
ఎవరు వారన్నాడు:
ఎవరు-వీరు,-

'నడచి నడచి వచ్చి-, బడలి పరుండి

పిలవ లేక పోయినారా?-'

'పిలిచేతీరు తెలియక-'

ఏ వరసనైనా పలికేముగా- తాము మంచి నిదురలో ఉండగా,- మేము ఆలయము నుంచి తిరిగి వస్తూ కనులు పావనము చేసి కొన్నాము: బడలిక గురుతించి నాము: పలుకరించ లేదు: జామాయె వచ్చిరు పలుకరించి నాము— యిప్పటికి సేద దీరి నారు: అనుమతించిన దేవర సేవ సేవించుకునేము-'



అన్నంతలో,- యిరువురు బాలలు మెరపులవలె వచ్చి- కైదండ లిచ్చి,- లోనికిపోయి,- పావనోదక స్నానాన తడి దీర్చి,- కట్టవస్త్రము లిచ్చి కల పమలంది.- బొగడ దండలు వేసి,- పుప్పొడి జల్లి,- తీయ తేనియ, కదళీ ఖర్జూరములు ఆరగింపజేసి,- కప్పుర విడె మిచ్చి, కైమోడ్పులిచ్చి,- మరు నికి పరవమ్మొసగిన వాడా,- మా కల మేలినస్వామీ: యీ రూపానవచ్చి మా కన్నెను మెచ్చేవా?- అని పలికి- అయ్యా,- మా మంజరి మక్కువ నీకే దక్కినదయ్యా!- అంటూ,- ఒక సింగారి చేయందుకొని,- పరసను నిలిపింది:

'అయ్యా: కల పడుగము: గుణ మనుగము: అల్లినాడు,- ఆలయంలో అయ్యవారు- నడి రేయికి నడిరేయి -మా కన్నెల చేకొందునని వర మిచ్చినారు: స్వామివారు విహరించే సీమకదా, అని.-సంజె పడగనే గ్రామంలో వారు యీ చాయలకురారు:

వారు దయచేసేరనే అనుదినమూ నిరీక్షించేము: వారూ,- ఏదో రూపావమ్మల్ని యింత వరకూ కటాక్షించుతూ నే వున్నారు:

అంతే - యిలాగే అనుకోండి:-

నడిరేయి మింతకుంగా.- యీ నాడు వారు మీరై దర్శనమిచ్చినారు; మేము ధన్యుల మైనాము: యిక తాము సెల వీయండి-' అన్నదాయెను :

అప్పుడు, - అతడనినాడు కదా. -

"మీరు చేసిన సపర్య స్వామి కర్పితము:

నేను కృష్ణా తీరమువాడను : మీ గానా భినయ చాతురి.-మీ తత్పరత, మానీమలో.- పరమ నైష్ఠికులే ప్రశంసించేరు :

పరమ శివుడు.- గిరి కన్యను చేబట్టిన కళ్యాణ గాథ,- మీ రభినయింపగా.- సందర్శించవలె ననేది - యింతవరకు తీరని కోరికగానే నిలిచిపోయినది-"

"అదొక్కటే తమకు తీరని కోరికా?-"

"మరొక్కటి ఉన్నది : అది వారు తీర్చవలసినదే-"

"మా స్వామివారు భక్త సులభులు కదయ్యా !- మన సెరిగి వర్తించేరు : మన సుల వర్తించేరు : మీకు మేలౌనులే,- గిరిజా కళ్యాణము తిలకించేరా ?-"

"యీ జామునా ?-"

"ఆ వైభవము నిత్య కళ్యాణము కదయ్యా !-"

స్వామివారి కేళీవనంలో,- కనక వేదిక మీద,- భీమనాధుడూ మాణిక్యాంబా,-పూవులల్లిన రూపముల కొలువుదీరంగా,- వీణెలు మీటే చేడియ లారుగురు.- వేణువు నూదే వారు ముగ్గురు.- కనక తప్పెటలవారు నలుగురు.- తాళ మందుకున్నవా రిద్దరు, - శంఖము పూరించే దొక్కతె.- పాటల బాలలు పదుగురు.- నాట్య సానులు పదిజతలు.- సాయముగా.- గుముల గుములు-

వీణ మ్రోగించి శంఖము మ్రోగినది-

వేణువులు క్రీడించి,- లయమాన మందియగా,- తాళము తమకించగా,- మర్దళములు గంగాఝుర విస్ఫారముగా.- గజ్జెల కలరవము క్రమ్ముకొనంగా,- కనక వేదిక మీద,- మల్లెలు విరజాజులు రాసులై,- అది కైలాస మైనది :

దేవసీ దేవరను - ప్రసన్నుల జేసికొని ప్రస్తుతించి,- "మీ పరిణయ గాథను మే మభినయించే మిషి,- మాకు నిత్య-దీవెన మే ప్పుడూ !" అని పలికి - కోలాహలము సేయంగా.-

ఆ రవళిలో,- చెలిమికత్తెలచేత బొనని పించుకుని.- కదలిపోయే నగరాజకుమారిని మదను డడ్డగించి,- హిమవంతుని కూతురివే,- నీవై వరుని వేద బోవలెనా,- ముగుదల అయ్యేనో వానిని నీ చరణ దాసునిగా సేయనా అని బింకాలు పలుకంగా.- ఆ తల్లి హిత బోధ చేయంగా.- వాడు లెక్కసేయక,- సదా శివుణ్ణి చెనకి,- రూపుమాసి పోవడం :

పిడలన్ నిను పూజ సేయగా

విధిగా నిన్నొక గేస్తు సేయగా.

దొరకొన్న రసాధి నాధు, చి

చ్చర కంటన్ పరిమార్తువా ప్రభూ !

అని రతీదేవి వాపోయి.- మీ కళ్యాణము లోక కళ్యాణమున కౌను : "మరుదేవున రూపున వర్తిలగా,- రతి సౌభాగ్యము రక్ష సేయవా !" అని వేడుకొనంగా.- నగరాజ తనయ,- తనదో మనవిగా,- మదనుడు భంగపడి అంబా అని ఆక్రోశించినాడు : నా మేనల్లునికి మరల రూపీయమని,- యిది నాకు వర మౌనని,- పలుకంగా,- స్వామి కనుల ఎదుట నిలచిన కన్నెమాట కాదనక - మదనుణ్ణి బ్రతికించడం,- వాడే ఆనాటి నుండే స్వామివారి అజ్ఞమేరకు, దక్షపురి సాని కూతుళ్ళకు వేదోడై,- మెలగుతూండడం - వా రాడగా పాడగా,- తిలకించిన వాడై,- "ఆహో నీదయ్యా వైభవము !- నిన్ను నేనూ నాకు చేతనైన తీరున కొనియాడే ననుమతించవయ్యా !- అని.- దీక్షగా,- ఆ వనములోనే నిలిచి,- కావ్యము నిర్మించినాడు :

కావ్యము రచన సేయడమైనదో లేదో అన్నయ్య మంత్రి వెదకికొనుచూ వచ్చినాడు : బంధుత్వము వరుస ద్రిప్పినాడు : యీ సుకృతములో లవలేశము నాకు దయ సేయవా !" అనినాడు ; "సాటి బ్రాహ్మణుడు చేజాపినపుడు కాదనను : మా తాత నన్ను అడుగ లేదు. ఆ ఋణ మిలా తీర్చుకుంటాను !" అని మనవి చేసినాడు శ్రీనాధుడు :

నగరం జేరుకున్నారు : చిట్టి పంతులకు మును ముందు వినిపించి - సన్నిధిలో ఉంచాడు : చిట్టి పంతులు,- అన్నయ కొక తులసి దళ మిచ్చి,- గ్రంధ మిచ్చి,- "అన్నయ మంత్రులవారు,-యింతకాలమూ పరువుగా కాలక్షేపము చేసి, యీనాటికి మీరూ,- మీ దైవమూ వీని పాల బడినారు : అంతవానినే అర్ధరాత్రివేళ దొంగత్రోవలు త్రొక్కించినాడు- మిమ్మల్ని వదిలేనా,- నవమన్మధుణ్ణి జేసేనేమో అనినామురుంపు:- కాసీయరా, నాన్నా యీ ముసలి రసికుని మీద నసిగా నీ కసి దీర్చుకో,- నే నలా యీదులాడ బోమేను ; తిరిగి రాగనే,- అవతారిక,- వినిపించేవుగాని-అంటూ చిట్టి పంతులు రెక్కలు కట్టుకున్నట్టు కదలిపోయినాడు : చూడగా చూడగా.- మనిషి కదలినట్లు లేదు-మబ్బు కదలినట్లున్నది గాని అడుగుతీసి అడుగువేసినట్లు లేదు మెరుపు దూసుకున్న వైఖరి కాని,-కనుల ముందున్న వా డు,- మా ట లో నే మాయమైనట్లని పించింది-

అదేమో,- అప్పుడు తెలియలేదు-

# రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు మేనేజింగ్ ఎడిటర్, జ్యోతి, ఇల స్ట్రీ పెద్ మంత్రి, బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ - 2 అనే చిరునామాకు పంపాలి.

తమ రచనలు నిరాకరింపబడిన పక్షంలో త్రిప్పి పంపగోరే వారు రచనలతోపాటే తగినన్ని తపాలా బిళ్ళలు జతచేసి పంపగోరుతున్నాము. రచన పంపిన కొన్నాళ్ళ కి తపాలా బిళ్ళలు పంపి త్రిప్పి పంపవలసిందని అడిగితే ఇబ్బంది అని రచయితలు గుర్తించ ప్రార్థన.

కథ లయితే "జ్యోతి" సైజులో పది పేజీలకు మించకుండా, వ్యాసాలయితే నాలుగయిదు పేజీలకు మించకుండా, గేయాలు, పద్యాలయితే ఒకటి రెండు పేజీలకు మించకుండా పంపగోరుతాము.

ఈ నిబంధనలను, ముఖ్యంగా చివరి దాన్ని పాటించి రచయితలు మాతో సహకరిస్తారని ఆశిస్తున్నాము.

మేనేజింగ్ ఎడిటర్,
జ్యోతి

ఆసుర సంజె వేళకు తెలియవచ్చినది-

పవలెల్ల,- నదిలో యీదులాడి,- సంజ వాలే తరుణాన చిట్టి వంతుల,- రాజహంస అయినాడట!- అహో!-

-ఆలయములో,- అర్చనవేళ, ఆరతి వెలుగులో,- ఆ ధూపములో,- కప్పురము వంటి హంస,- శ్రీనాధుని కనులలో కలయ దిరిగినది- తానప్పుడనుకొనినాడు: "చిట్టి వంతులూ, నీ దారి నీవు చూసుకున్నావు; నన్నరికట్టినావు; నీవు తిరిగి రానిదే నేను కదలరాదని కట్టడి - నీవు రావు!- నేను కదలను - యీ జన్మ కింతే,- నీవున్నచోట నిలిచి,- నీ సేవలు,- నే వందించేనులే—

స్వామి వారాలకిందంగా,- అవతారిక— భాగము అన్నయ్య మంత్రి. తానొక్కడే విన్నాడు; విని యిలా అన్నాడు.

'చిట్టి వంతులు దీవించి నట్టే జరిగినది. యీ ముదుసలికి వాక్చందనచర్చ జేసి,- రసికుని జేసినావు; దానికేమిగాని,- 'పంచారామములందు వల్వేల పురిన్ ప్రౌఢేందు బింబాననల్,-' అని ఉగ్గడించడం,- అంత లోపంకాదు కాని,-'

'— యిందులో కాని పనేమీ మీరు చేయలేదు-మీ ప్రౌఢాంగనలూ చేయ లేదు. అన్నయ్యగారూ మీరు పరమ రసికులని,- నేను శ్రైవారము చేయలేదు-చేసినా చెల్లదు- చెల్లించుకునే వయసు కాదు; పద్యములువిన్న ఏ మగవాడూ తన యిల్లాలి మీద కన్నె మనడు; తాతగారు యీ వయసున కుప్పి గంతులు వేయ నారంభించారని రగడ సేయరు—

దక్షారామము చేరుకున్నాను—ఆ వైభవములో,- మరల నాకవితకు, చైతన్యము వచ్చినది- నా పలుకులు మీకు గిలిగింతలు కావు సదాశివుని దీవెనలయ్యేను!

చనవు చేసినాను; మీ మనసుకు ముదిమి తప్పించినాను- యిది చిట్టి వంతులు చలువ; కేవలమిది నా కవిత కాదు ఆ రాజహంస మీటిన కనక వీణ. ●


---

● పెద్దవాళ్లని చూసి అనుకరించే గుణం పిల్లలకి పుట్టుకతోనే వస్తుంది. అందుకే మంచి అలవాట్లు నేర్పుదామని మనమెంత ప్రయత్నించినా, వాళ్ల కన్నీ చెడ్డ అలవాట్లే వస్తాయి.

● భార్యల చెప్పుచేతల్లో వుంటూ ఆ సంగతి చెప్పుకోడానికి సిగ్గుపడే భర్తల్ని సులభంగా కనిపెట్టవచ్చు. సాధారణంగా వాళ్లు కంచాలు కడుగుతూ ఈలపాట పాడుతూవుంటారు.



# మార్పుకి మరో పేరు



శివరాజు సుబ్బులక్ష్మి

రంగారావుకి తండ్రి దగ్గరనుంచి వచ్చిన తంతి చూడగానే కాళ్ళ గొంచి దడ వచ్చినంత పని అయింది. నెమ్మదిగ వంట గదిలోకి చేరాడు.

"చూడు రాజ్యం! నాన్న దగ్గరనుంచి టెలిగ్రాము వచ్చింది. మా అమ్మ, చెల్లెలు వస్తున్నారట. ఈ పూట స్టేషనుకు వెళ్ళాలి" అని నీళ్ళు నములుతూ భార్యకి చెప్పాడు.